సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం ॥ 2 ॥ జూలై ॥ 2024



10.136 టీఎంసీల నిల్వ

సోమశిల: జలాశయంలో సోమవారానికి 10.136 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 378 క్యూసెక్కుల వరద వస్తుండగా, దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.73,920
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,638
3 శాతం జీఎస్టీతో	రూ.6,837
నవర (8 గ్రా)	రూ.54,696

గరిష్టం/కనిష్టం
30.6 /25.9

వాతావరణం

వాతావరణంలో తేమ 60 శాతం ఉంది. జిల్లాలో మంగళవారం అక్కడక్కడ ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. పగటి పూట వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్): భారత దేశ వ్యాప్తంగా సోమవారం నుంచి మూడు కొత్త చట్టాలను ప్రవేశ పెట్టడానికి నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఉమా మహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్య యాదవ్ సహాయ కార్యదర్శి వరప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం అత్యవసర కమిటీ సమావేశం నిర్వహించి మూడు చట్టాల అమలును ఖండిస్తూ నిరసనగా కోర్టు విధులు బహిష్కరించాలని ఏకగ్రీవ తీర్మానం చేసినట్టు తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.

ఏపీ ఓపెన్ పరీక్ష ఫలితాల విడుదల

నెల్లూరు (టౌన్): ఏపీ ఓపెన్ స్కూల్ పదో, ఇంటర్ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదల చేశారు. పదో తరగతికి సంబంధించి 275 మంది పరీక్ష రాయగా 108 మంది ఉత్తీర్ణత సాధించారు. 39.27 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఏపీలో జిల్లా 22వ స్థానంలో నిలిచింది. ఇంటర్‌కు సంబంధించి 585 మందికి గాను 211 మంది ఉత్తీర్ణులయ్యారు. 36.07 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్రంలో 26వ స్థానంలో జిల్లా నిలిచింది.

కామాక్షితాయి ఆలయ ఈఓగా ఏవీఎస్‌రెడ్డి



ఈఓను సత్కరించిన ఆలయ అర్చకులు, సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయ ఈఓగా ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది ఈఓను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

మెడికల్ కళాశాలలో డొల్లతనం




నెల్లూరు (అర్బన్)/ఆత్మకూరు (చేజర్ల): చేజర్ల మండలం చిత్తలూరు పీహెచ్‌సీలో పని చేస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతి (27)సోమవారం నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 4వ అంతస్తు నుంచి కింద దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటనతో మెడికల్ కళాశాలలోని డొల్లతనం మరోసారి వెలుగు చూసింది. పేరుకే పెద్ద మెడికల్ కళాశాల అయినప్పటికీ కనీసం సీసీ కెమెరాలు అమర్చ లేదు. కేన్సర్ వ్యాధిపై మొదటి అంతస్తులో శిక్షణ జరుగుతోంది. కేవలం శిక్షణకు మాత్రమే వచ్చింది. ఆమె అక్కడ ఎవరికీ తెలియదు. మధ్యాహ్నం తర్వాత ఫోన్ రావడంతో ఆమె మాట్లాడుకుంటూ ఒంటరిగానే 4వ అంతస్తుకు వెళ్లింది. అక్కడ ఉండాల్సిన సెక్యూరిటీ గార్డులు బయట ఉన్నారు. ఆమె వెళ్లిన నాలుగు ఫ్లోర్‌లో సెక్యూరిటీ గార్డులు లేరు. క్షణికావేశంలో కానీ, ఇతర ఒత్తిళ్లతో అక్కడి నుంచి దూకేటప్పుడు సమీపంలో ఎవరైనా సెక్యూరిటీ గార్డులు, వాచ్ మెన్‌లు ఉండి ఉంటే ఇలాంటి దారుణాలు చోటు చేసుకుని ఉండేవి కావు.

చిత్తలూరు విషాదం

చిత్తలూరు పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ జ్యోతి నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాల మేడపై నుంచి దూకి మృతి చెందడంతో చిత్తలూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. సోమవారం నెల్లూరులోని జీజీహెచ్‌లో జరిగిన శిక్షణా కార్యక్రమాల్లో ఆమె తన భర్త రవీంద్రతో కలిసి పాల్గొన్నట్లు సమాచారం. కొద్దిసేపటికే పైఅంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడంపై ప్రజలు విచారం వ్యక్తం చేశారు. ఆమె రోగులతో ఆప్యాయంగా మాట్లాడుతూ మంచి వైద్యం అందించే వారన్నారు. శనివారం సైతం ఆమె కొల్లపునాయుడుపల్లి, ఎనీకంద్రిక గ్రామాల్లో 104 వైద్య శిబిరాల్లో పాల్గొన్నట్లు చెబుతున్నారు.

అమ్మకు వందనం.. అయోమయం



- పాఠశాలలు, కళాశాలలు ప్రారంభించినా ఆ ఊసేలేని అమ్మఒడి
- కేబినెట్ సమావేశంలోనూ చర్చకు రాలేదు
- ఇంకా ఎలాంటి విధివిధానాలు రాలేదంటున్న విద్యాశాఖాధికారులు
- ఎంత మంది పిల్లలు ఉంటే అందరికి అమ్మకు వందనం
- తల్లుల ఎదురుచూపులు

గత ప్రభుత్వ హయాంలో పాఠశాలలు పునః ప్రారంభం నాటికి అమ్మఒడి

జూనియర్ కళాశాలలు పునః ప్రారంభించి నెల రోజులు, పాఠశాలలు ప్రారంభించి రెండు వారాలు దాటాయి. అమ్మకు వందనంగా మారిన అమ్మఒడి పథకంపై అయోమయం నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తొలి రెండేళ్లు ఏటా జనవరిలోనే ఈ పథకం ద్వారా తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసింది. అయితే పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలనే నిబంధన పెట్టి రెండేళ్లు పాఠశాలలు తెరిచిన తర్వాత జమ చేస్తూ వచ్చింది. గత విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది జూన్‌లో అమ్మఒడి నగదు జమ చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం మారడంతో ఈ పథకానికి సంబంధించిన నిధుల జమపై నీలి నీడలు కమ్ముకున్నాయి.



సంవత్సరం	విద్యార్థులు	జమ చేసిన మొత్తం (రూ.కోట్లల్లో)
ఉమ్మడి జిల్లా		
2019-20	2,51,811	377,71,65,000
2020-21	4,07,272	610,90,80,000
విజభన జిల్లా		
2021-22	2,31,866	347,79,90,000
2022-23	2,26,205	339,30,75,000
2023-24	4,10,779	-------

నెల్లూరు (టౌన్) : అమ్మ ఒడి కోసం లక్షలాది మంది తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. పేదింటి విద్యార్థులందరూ చదువుకునేందుకు తల్లిదండ్రులకు భరోసాగా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకాన్ని 2020 జనవరి 9వ తేదీన ప్రారంభించారు. అదే ఏడాది కరోనా రావడంతో గత విద్యా సంవత్సరంలోని విద్యార్థులందరినీ అర్హులుగా నిర్ణయించి 2021 జనవరి 9వ తేదీన రెండో ఏడాది కూడా అమ్మఒడి పథకం నిధులు జమ చేశారు. అయితే పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని, విద్యా ప్రమాణాలు పెంచేందుకు 75 శాతం హాజరు దినాల ప్రాతిపదికన అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తున్నట్లు అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. 2022 జూన్ 27వ తేదీ, 2023 జూన్ 28 తేదీన అమ్మ ఒడి నిధులు తల్లుల ఖాతాల్లో జమ చేసింది. ఈ ఏడాది కూడా జూన్ చివరిలో అమ్మఒడి నిధులు జమ చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం మారడంతో ఈ పథకంపై అయోమయం నెలకొంది.

ఈ ఏడాదికి ఇంకా స్పష్టత లేదు

ఇప్పటికే తమ పిల్లలను అప్పోసప్పో చేసి తమ పిల్లలను ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో చేర్పించారు. ఎన్నికల మేనిఫెస్టోలో టీడీపీ ప్రభుత్వం అమ్మకు వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలు బడికి పోతే అంత మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున అందిస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడి 20 రోజులు దాటించింది. రెండు సార్లు కేబినెట్ సమావేశం నిర్వహించారు. అయితే అమ్మకు వందనంపై ఇంత వరకు విధివిధానాలు నిర్ణయించలేదు. కేబినెట్ చర్చ కూడా నిర్వహించిన దాఖలాలు లేవు. కనీసం ప్రభుత్వ పెద్దలు ప్రస్తుతం ఈ ఊసే ఎత్తలేదు. గత ప్రభుత్వంలో పాఠశాలలు తెరిచిన తర్వాత అమ్మఒడి పథకాన్ని అందించేది. ఆ డబ్బులతో ఆయా పాఠశాలలు, కళాశాలల్లో ఫీజు చెల్లించుకునే పరిస్థితి ఉండింది. ఈ ఏడాది పరిస్థితిపై తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

జిల్లాలో 3,639కు పాఠశాలలు, కళాశాలలు

గత ప్రభుత్వం 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అమ్మఒడి పథకాన్ని అమలు చేశారు. గడిచిన నాలుగేళ్లు ఈ పథకాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ముందే కేలండర్ ప్రకటించి అందించారు. జిల్లాలో మొత్తం 3,431 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, 208 ప్రభుత్వ ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. పాఠశాలల్లో 3,54,779 మంది విద్యార్థులు, జూనియర్ కళాశాలల్లో 56 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. అయితే గతంలో కుటుంబంలో ఒక బిడ్డకే ఈ పథకాన్ని వర్తింప చేసింది. ప్రస్తుతం టీడీపీ ప్రభు త్వం చెప్పిన ప్రకారం జిల్లాలో ఈ ఏడాది దాదాపు 4.10 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకాన్ని ఇవ్వాల్సి ఉంటుంది.

ఈ ఏడాది 1.80 లక్షల మందికి పైగా పెరిగే అవకాశం

ఈ విద్యా సంవత్సరం అమ్మఒడి పథకం కింద 1.80 లక్షల మందికి పైగా విద్యార్థులు పెరిగే అవకాశం ఉంది. ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలను బడికి, కళాశాలకు పంపించినట్లయితే అంత మంది పిల్లలకు తల్లికి వందనం పేరుతో పథకాన్ని అమలు చేస్తామని టీడీపీ హామీ ఇచ్చింది. అయితే ఇప్పటి వరకు ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి విధివిధానాలు జిల్లా విద్యాశాఖాధికారులకు రాలేదు. కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పథకాన్ని అమలు చేస్తారా? లేక ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు కూడా అమలు చేస్తారా? అనే దానిపై రకరకాలుగా ఊహాగానాలు ప్రచారంలో ఉండడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. గత ప్రభుత్వం ఇంట్లో ఒక బిడ్డకే ఇచ్చినా ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ విద్యార్థులకు పథకాన్ని అందించింది. రాష్ట్ర విద్యాశాఖా మంత్రిగా సీఎం తనయుడు లోకేశ్ వ్యవహరిస్తున్నారు.

ఎలాంటి విధివిధానాలు రాలేదు

అమ్మకు వందనం పథకానికి సంబంధించి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నుంచి ఎలాంటి విధివిధానాలు ఇప్పటి వరకు రాలేదు. ఈ పథకానికి సంబంధించి సమాచారం కూడా అందలేదు. ఏవైనా విధివిధానాలు వస్తే అందుకనుగుణంగా పథకానికి సంబంధించి లబ్ధిదారులను ఎంపిక చేస్తాం . గతంలో కంటే ఈ ఏడాది లబ్ధిదారుల సంఖ్య పెరుగుతుంది.

– పీవీజే రామారావు

తొలి హామీ పింఛన్లను పెంచి అందించాం

- మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన మాట ప్రకారం గతంలో ఇస్తున్న రూ.3 వేలు పింఛన్‌కు రూ.వెయ్యి పెంచి రూ.4 వేలు సోమవారం తెల్లవారుజాము నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అందించామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ డాక్టర్ నారాయణ చెప్పారు. సోమవారం ఉదయం నెల్లూరు నగరంలోని 13వ డివిజన్ యనమలవారిదిన్నెలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంత్రి నారాయణ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత అక్కడి వినాయకుని గుడిలో పూజలు నిర్వహించారు. జెండావీధి, కపాడిపాళెం, వెంకటేశ్వరపురంలో లబ్ధిదారులకు మంత్రి నారాయణ పింఛన్లు అందజేశారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ ఏప్రిల్, మే, జూన్ నెలల బకాయిలు రూ.3 వేలు, ఈ నెల పింఛన్ రూ.4 వేలు మొత్తం కలిపి రూ.7 వేలను అందించడంతో లబ్ధిదారుల ఆనందానికి అవధుల్లేవన్నారు. రాష్ట్రమంతా పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందాలని, పరిశ్రమలు రావాలని, కన్‌స్ట్రక్షన్ పెరగాలన్నారు. చిరువ్యాపారస్తుల నుంచి పెద్ద పెద్ద వ్యాపారస్తులందరి వ్యాపారాలు పెరిగినప్పుడే ప్రభుత్వానికి జీఎస్టీ, ఇన్‌కమ్‌ట్యాక్స్, టీడీఎస్ వస్తాయన్నారు. గతంలో పింఛన్లను వలంటీర్లు ఇచ్చేవారని, ఎన్నికల కమిషన్ వలంటీర్ల పాత్ర ఉండకూడదని వారిని ఆపేశారన్నారు. సీఎం చంద్రబాబు సచివాలయ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులందరూ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



నెల్లూరు నగరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి నారాయణ, చిత్రంలో కమిషనర్ వికాస్‌మర్మత్

వేకువజాము నుంచే పింఛన్ల పంపిణీ

- కలెక్టర్ హరినారాయణన్

కోవూరు: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జిల్లాలో తొలి రోజే వంద శాతం పూర్తి చేసేందుకు వేకువ జాము నుంచే అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఎం. హరినారాయణన్ తెలిపారు. కలెక్టర్ సోమవారం కోవూరులోని పడుగుపాడు, నెల్లూరు నగరంలోని మన్సూర్‌నగర్, రూరల్ పరిధిలోని దేవరపాళెంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆయన ఆయా నియోజకవర్గాలు, మండల కేంద్రాలు, తదితర ప్రాంతాల్లో మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు, వివిధ స్థాయి ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. నూతనంగా పెరిగిన పింఛన్ మొత్తం రూ.4 వేలు, గత మూడు నెలల బకాయిలు రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7 వేలతో పాటు ముఖ్యమంత్రి లేఖ, రసీదు లబ్ధిదారులకు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, దివ్యాంగులు, తీవ్ర అనారోగ్య బాధితులు వంటి వివిధ రకాలు కలిపి మొత్తం 3,13,757 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కోవూరు పడుగుపాడులో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.హరి నారాయణన్

తొలి రోజు 93.57 శాతం..

నెల్లూరు(పొగతోట): జిల్లా వ్యాప్తంగా 93.57 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. 3,13,757 మంది లబ్ధిదారులకు నగదు అందజేయాల్సి ఉండగా 2,93,569 మందికి పంపిణీ చేశారు. ఇంకా 20188 మంది లబ్ధిదారులకు నగదు అందించాల్సి ఉంది. 2,244 ఏఆర్‌టీ పింఛన్లు వీటిలో కలపలేదు.

12 వరకు 'నేను బడికి పోతా'

- సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి

నెల్లూరు (టౌన్): బడి బయట పిల్లలను బడిలో చేర్పించేందుకు గత నెల 13వ తేదీ నుంచి ప్రారంభమైన 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని ఈ నెల 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి తెలిపారు. సోమవారం ఆమె సమగ్రశిక్ష కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, జిల్లా స్థాయిలో డీఈఓ, ఏపీసీ, ఐసీడీఎస్, డీఎంహెచ్ఓ, ఎస్పీ, కార్మికశాఖ, మెప్మా, డీఆర్‌డీఏ తదితర శాఖల అధికారులు ఉంటారని చెప్పారు. జిల్లా స్థాయి కమిటీ కన్వీనర్‌గా సమగ్రశిక్ష ఏపీసీ వ్యవహరిస్తారని తెలిపారు. 6–14 ఏళ్లలోపు పిల్లలందరూ బడిలో ఉండాలన్నారు. జిల్లాలో 100 శాతం పిల్లలు బడిలో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్య ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు తెలియజేసి వారి పిల్లలను బడిలో చేర్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలల్లో 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు బోధిస్తున్న ప్రిన్సిపల్స్‌కు సోమవారం నుంచి మూడు రోజుల పాటు స్థానిక పోలీసు కార్యాలయంలో సమీపంలోని అవెన్యూ స్కూల్‌లో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని 8 కేజీబీవీల్లో 100 శాతం పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. అన్ని కేజీబీవీల్లో 100 శాతం అడ్మిషన్లు జరిగాయన్నారు. జిల్లాలోని 40 ప్రభుత్వ హైస్కూల్స్, 2 ప్రాథమిక స్కూల్స్‌కు పీఎంశ్రీకి ఎంపికైనట్లు చెప్పారు. ఒక్కో స్కూల్‌కు తొలి విడతలో రూ. లక్ష విడుదల చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో విద్యాకానుకకు సంబంధించి 26 మండలాల్లో బూట్లు, సాక్స్‌లు అందజేసినట్లు చెప్పారు.



మాట్లాడుతున్న ఏపీసీ ఉషారాణి

పీఎం సూర్యఘర్ పథకంతో అదనపు ఆదాయం

- ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్

నెల్లూరు (వీఆర్సీసెంటర్): పీఎం సూర్య ఘర్ పథకానికి మంచి స్పందన వస్తోందని, ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబం అదనపు ఆదాయాన్ని పొందవచ్చని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ తెలిపారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో కోటి కుటుంబాలకు నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడంతో పాటు, రూ. 15 వేల ఆదాయాన్ని పొందడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ పథకం కోసం వెయ్యి మంది నమోదు చేసుకున్నారన్నారు. ఈ పథకం ద్వారా ఇంటి కప్పుపై సోలార్ ప్యానల్స్ (పలకలు) ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను వినియోగించుకోవడంతో పాటు మిగిలిన విద్యుత్‌ను డిస్కమ్‌లకు విక్రయించుకునేలా అవ కాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సూర్యఘర్ పథకంలో లబ్ధి పొందాలంటే ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఫోన్ నంబరు, ఈ–మెయిల్ ఐడీ నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ పూర్తి చేయాల్సి ఉంటుందని, తదనంతరం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పథకం పొందాలంటే ఇంటిపై కప్పుపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునేందుకు 10 చదరపు మీటర్ల స్థలం ఉండాలని ఈ సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు ఒక కిలో వాట్‌కు రూ.50 వేల నుంచి రూ.60 వేలు ఖర్చవుతుందని రాయితీపై రూ.30 వేలు అందుతుందన్నారు. ఒక కుటుంబానికి రెండు కిలో వాట్ల సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ మంజూరు చేస్తారని, దీనికి రూ.1.45 లక్షలు ఖర్చు అవుతుండగా రూ.60 వేలు కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, రెండు కిలో వాట్ల కంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు కోసం అయ్యే ఖర్చులో రూ.78 వేలు రాయితీ లభిస్తుందని ఈ అవకాశాన్ని జిల్లా వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

నెల్లూరు ఆర్ఎంగా విజయరత్నం

నెల్లూరు సిటీ: ఏపీఎస్ఆర్టీసీ నెల్లూరు రీజనల్ మేనేజర్‌గా జీ విజయరత్నంను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయరత్నం సోమవారం ఆర్ఎం చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో చీఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ మెయింటెనెన్స్ విభాగంలో విధులు నిర్వహిస్తూ నెల్లూరు ఆర్ఎంగా బదిలీ అయ్యారు. ఆయన గతంలో కడప ఆర్ఎంగా కూడా పనిచేశారు. నెల్లూరు ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న జీ విజయరత్నం

రూ.15 లక్షల పొగాకు బేళ్ల చోరీ

ఉదయగిరి: వరికుంటపాడు సమీపంలోని కోల్డ్ స్టోరేజీ వరండాలో నిల్వ చేసిన పలువురు పొగాకు రైతులకు చెందిన 33 పొగాకు బేళ్లను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చోరీ చేశారు. సరుకు విలువ సుమారు రూ.15 లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. రైతులు, పోలీసుల తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని ఆండ్రావారిపల్లికి చెందిన చీమల రాము (12 బేళ్లు), ఆండ్రా శ్రీను (6 బేళ్లు) ఆండ్రా వెంకటేష్ (4 బేళ్లు), ఆండ్రా అమర (4 బేళ్లు), ఆండ్రా లక్ష్మీరెడ్డి (2 బేళ్లు)తో పాటు మరి కొంత మంది రైతులు 33 బేళ్లను కోల్డ్ స్టోరేజీ వరండాలో కొద్ది రోజుల నుంచి నిల్వ ఉంచారు. ఇటీవల కోల్డ్ స్టోరేజీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురికావడంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. పైగా కొన్ని రోజుల నుంచి అక్కడ కాపలా ఉన్న వాచ్‌మెన్ కూడా విధులకు హాజరు కావడం లేదు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రెండు డీసీఎం వాహనాలు తీసుకువచ్చి 33 బేళ్లను లోడు చేసుకుని తీసుకెళ్లారు. సోమవారం ఉదయమే కోల్డ్ స్టోరేజీ వద్దకు వెళ్లిన రైతులు తమ పొగాకు బేళ్లు చోరీకి గురయ్యాయని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై తిరుపతయ్య ఘటనా స్థలానికి చేరుకుని ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

దర్యాప్తు ముమ్మరం

పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. జాతీయ రహదారిపై ఉన్న సీసీ కెమెరాలతో పాటు పలు దుకాణాలు, పెట్రోలు బంకుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. పామూరు వైపు ఈ వాహనాలు వెళ్లినట్లుగా సీసీ కెమెరాల్లో పోలీసులు గుర్తించారు. వాహనాలకు సంబంధించి రికార్డయిన దృశ్యాలు సక్రమంగా కనిపించకపోవడంతో ఆ వాహనాలకు సంబంధించిన నంబరు ప్లేట్లు గుర్తించలేకపోయారు. ఈ వాహనాలు పోలీస్‌స్టేషన్ సమీపం నుంచే వెళ్లినప్పటికీ పోలీసులు వరికుంటపాడు సెంటర్, పోలీస్‌స్టేషన్ ఆరుబయట, తిమ్మారెడ్డిపల్లిలో సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో చోరీ చేసిన వాహనాలు అందులో రికార్డ్ కాలేదు. ఇటీవలే పోలీసు ఉన్నతాధికారులు కీలకమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించినప్పటికీ స్థానిక పోలీసులు పట్టించుకోలేదు. దీంతో విలువైన సొత్తు చోరీ అయినప్పటికీ అందుకు ఉపయోగించిన వాహనాలను గుర్తించలేని పరిస్థితికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ వాహనాలను గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టారు. కాగా ఈ చోరీకి సంబంధించి రైతుల నుంచి ఫిర్యాదు అందినప్పటికీ కేసు నమోదు చేయకుండా పోలీసులు సరుకు కోసం గాలింపు చేస్తున్నట్లుగా తెలుస్తోంది.



పొగాకు బేళ్లు నిల్వ ఉంచిన కోల్డ్ స్టోరేజీ

తమ్ముళ్ల తన్నులాట

- ఆధిపత్యం కోసం టీడీపీ వర్గీయుల వాగ్వాదం
- ఎమ్మెల్యే కాకర్ల సమక్షంలోనే దుర్భాషలు
- సమస్య ముదరడంతో వెళ్లిపోయిన ఎమ్మెల్యే
- టీడీపీ నేత, మాజీ సర్పంచ్‌పై చేయిచేసుకున్న మరోవర్గం

ఉదయగిరి: ఎన్టీఆర్ పింఛన్ భరోసా పంపిణీ కార్యక్రమం సందర్భంగా ఉదయగిరిలో తమ్ముళ్ల మధ్య తన్నులాట జరిగింది. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సమక్షంలోనే ఉదయగిరిలోని రెండు టీడీపీ వర్గాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ వాగ్వాదానికి దిగారు. సమస్య జటిలమవుతుండడంతో ఎమ్మెల్యే సర్దిచెప్పలేక అక్కడి నుంచి జారుకున్నారు. ప్రత్యక్ష సాక్షులు, వివిధ వర్గాల సమాచారం మేరకు ఉదయగిరి నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పలు మండలాల్లో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని పలువురు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ క్రమంలో నియోజకవర్గ కేంద్రం ఉదయగిరిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కాకర్ల మధ్యాహ్నం 2 గంటలకు చేరుకున్నారు. అధికారికంగా ఎస్సీకాలనీలో ఉన్న పలువురు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయితే టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి వర్గీయులు అనధికారికంగా బీసీకాలనీ, ఎస్టీకాలనీల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఆయన ఆ రెండు కార్యక్రమాలు పూర్తి చేసుకొని ఎస్సీకాలనీకి వెళ్లారు. అక్కడే వేచి ఉన్న మండల కన్వీనర్ బయ్యన్న వర్గీయులు తీవ్ర అసహనంతో అధికారికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముందుగా రాకుండా మిగతా రెండుచోట్లకు వెళ్లడంపై ఎమ్మెల్యేను ప్రశ్నించారు.



ఇరువర్గాలకు సర్దిచెబుతున్న ఎస్సై

దీంతో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాలాభిషేకాలు తదితర కార్యక్రమాలు ఎందుకు ఏర్పాటు చేశారని అధికారులను ప్రశ్నించారు. టీడీపీ నేత మన్నేటి వెంకటరెడ్డి ఎమ్మెల్యేను గంగిరెడ్డిపల్లిలోని తన ఇంటికి భోజనానికి ఆహ్వానించడం, మరో వర్గీయులు అభ్యంతరం తెలపడంతో ఆయన నేరుగా ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. మొత్తం ఈ వ్యవహారంతో కొంత కలత చెందిన ఎమ్మెల్యే ఏ మండలంలోనూ పెద్దగా సమస్యలు లేవని, ఈ మండలంతోనే తనకు ఇబ్బందిగా ఉందని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో అక్కడే ఉన్న దాసరపల్లికి చెందిన ఓ టీడీపీ నేత కొండాయపాళెం పంచాయతీకి సంబంధించిన సమస్యే కదా సార్ అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. దీంతో కొండాయపాళేనికి చెందిన వెంకటరెడ్డి వర్గీయులు వాగ్వాదానికి దిగడంతో ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత మన్నేటి వెంకటరెడ్డి, బయ్యన్న వర్గీయుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పి సమస్యను సద్దుమణిగేలా చేశారు. ఆ తర్వాత కొంతసేపటికి ఉదయగిరి పంచాయతీ బస్టాండ్‌లోని గండిపాళెం రోడ్డులో ఓ దుకాణం వద్ద వేచి ఉన్న కొండాయపాళెం మాజీ సర్పంచ్ మధుపై వెంకటరెడ్డి వర్గీయులు వాగ్వాదానికి దిగి చేయిచేసుకున్నారు. అక్కడ పరిస్థితిని గమనించిన సీఐ గిరిబాబు వెంటనే రంగప్రవేశం చేసి ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించి మధును స్టేషన్‌కు తీసుకొచ్చారు. దుత్తలూరు, ఉదయగిరి పోలీసు బలగాలతో పంచాయతీ బస్టాండ్ ప్రాంతంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి ఎలాంటి వివాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకున్నారు. సమస్య సద్దుమణిగిందని భావించిన రెండు గంటల తర్వాత పోలీస్ పికెట్ ఎత్తివేశారు.

నెల రోజులు గడవక ముందే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి నెల రోజులు కూడా గడవక ముందే తమ్ముళ్ల మధ్య ఆధిపత్యం కోసం తగాదాలు, తన్నులాటలు జరుగుతుండడాన్ని చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాల్సిన నేతలు తమ ఆధిపత్యం కోసం బాహాబాహీకి దిగడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని పలు మండలాల్లో టీడీపీ నేతల మధ్య వర్గపోరు కొనసాగుతోంది. ఒకరిపై ఒకరు ఆధిపత్యం చలాయించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్తగా రాజకీయ ప్రవేశం చేసి ఎమ్మెల్యేగా గెలిచిన కాకర్ల సురేష్ ఈ సమస్యలు ఎలా అధిగమించి పార్టీని సజావుగా నడపాలోనని తలపట్టుకుంటున్నారు. మొత్తమ్మీద పార్టీలో సమస్యలు సృష్టించే వారిపై ఎమ్మెల్యే దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇలాంటి ఘటనలు జరిగితే ఎవరినైనా సహించేది లేదని ఆయన అనుచరుల వద్ద చెప్పినట్లు సమాచారం.

ఇంటింటికీ పింఛన్ల పంపిణీ జగన్ ఆలోచనే

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(పొగతోట): ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసిన ఆలోచన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల పంపిణీని ప్రారంభించి ఇంటి వద్దే లబ్ధిదారులకు అందించాలన్న నిర్ణయం సంతోషకరమని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన అనేక సంస్కరణల్లో ప్రతి నెలా 1వ తేదీన పింఛన్ లబ్ధిదారులకు ఇంటి వద్దే పెన్షన్ నగదు అందించడం ఒకటని తెలిపారు. ఇలాంటి అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి భవిష్యత్ ప్రభుత్వాలకు ఆయన మార్గదర్శిగా నిలిచారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తూ ఇంటి వద్దే పింఛన్ల నగదు అందిస్తోందని తెలిపారు. వివిధ కారణాల వల్ల సోమవారం కొంతమంది పింఛన్ లబ్ధిదారులకు ఇంటి వద్దే నగదు అందించలేకపోయారని తెలిపారు. సమస్యలను అధిగమించి భవిష్యత్‌లో ప్రతి నెలా 1వ తేదీనే లబ్ధిదారులకు ఇంటి వద్దే పింఛన్ నగదు అందించాలని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం ఆదేశాల మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి లబ్ధిదారుల ఇళ్లకే నేరుగా వెళ్లి పింఛన్ నగదు అందించారని, ఈ ప్రక్రియను కొనసాగిస్తూ సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు పింఛన్ నగదు అందజేస్తున్నారని తెలిపారు.

శ్రీరామ్ చిట్స్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

- గంటల తరబడి శ్రమించి మంటలను అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది
- సుమారు రూ.85 లక్షల మేర ఆస్తి నష్టం



శ్రీరామ్ చిట్స్ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న పొగలు

నెల్లూరు(క్రైమ్): విద్యుత్ షార్ట్‌సర్క్యూటా? ఎవరైనా తగులబెట్టారో స్పష్టమైన కారణం తెలియదు కానీ నెల్లూరు నగరంలోని శ్రీరామ్ చిట్స్, ఫైనాన్స్ కార్యాలయంలో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. రూ.85 లక్షల మేర ఆస్తి నష్టం వాటిలినట్లు తెలుస్తోంది. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాలు, సేకరించిన సమాచారం మేరకు.. గాంధీబొమ్మ సమీపంలోని కొత్తహాల్ అనుకుని జీ+2 భవనం ఉంది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో అనేక వాణిజ్య దుకాణాలు, మొదటి అంతస్తులో బ్యాంక్ ఆఫ్ బరోడా, రెండో అంతస్తులో శ్రీరామ్ చిట్స్, ఫైనాన్స్ కార్యాలయం, పెంట్‌హౌస్‌లో భవన యజమాని ఉంటున్నారు. మరోవైపు నర్సింగ్ హోమ్ ఉంది. సోమవారం సుమారు 8 గంటల ప్రాంతంలో శ్రీరామ్‌చిట్స్ కార్యాలయం నుంచి దట్టమైన పొగలు రాసాగాయి. ఈ విషయాన్ని ఎదురుగా ఉన్న ఓ బ్యాంకు సెక్యూరిటీ గార్డు అబ్దుల్ రజాక్ గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. నెల్లూరు అగ్నిమాపక అధికారి వి.శ్రీనివాసులురెడ్డి, సహాయ అగ్నిమాపక అధికారి ఎస్.వేణుగోపాల్ తమ సిబ్బందితో, మూడు అగ్నిమాపక శకటాలతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మెట్ల ద్వారా కార్యాలయంలోకి వెళ్లే వీలు లేకపోవడంతో నిచ్చెనల సహాయంతో మూడువైపులున్న కిటికీలకు ఉన్న అద్దాలను పగులగొట్టి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే అప్పటికే కార్యాలయంలోని ఫర్నీచర్, కంప్యూటర్లు, ప్రింటర్లు, ఫైల్స్ పూర్తిగా దగ్ధమయ్యాయి. క్యాష్‌బాక్స్‌ను గుర్తించిన అగ్నిమాపక సిబ్బంది అందులో ఉన్న బంగారు ఆభరణాలు, నగదును చిట్స్ ప్రతినిధులకు అందజేశారు. కార్యాలయంలో సేఫ్‌లాకర్ భద్రంగా ఉంది. దాదాపు 8 గంటలపాటు అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో రూ.85 మేర ఆస్తి నష్టం జరిగి ఉంటుందని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. సుమారు రూ.1.02 కోట్ల విలువైన ఆస్తిని అగ్నిమాపక సిబ్బంది కాపాడగలిగారు. మంటల ధాటికి భవనం బీటలు వారింది. మరోవైపు నర్సింగ్ హోమ్‌లోకి దట్టమైన పొగలు రావడంతో అక్కడి సిబ్బంది ఏం జరిగిందో తెలియక బయటకు పరుగులు తీశారు. కార్యాలయంలో అగ్ని ప్రమాదానికి గల కారణాలు ఏమై ఉండవచ్చనేది ఇంతవరకూ తెలియరాలేదు. పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు తెలియాల్సి ఉంది.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నామమాత్రపు స్పందన

నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నామమాత్రపు స్పందన కనిపించింది. జిల్లావ్యాప్తంగా పింఛన్ల పంపిణీ జరుగుతుండడంతో సమస్యలు తెలుపుకునేందుకు చెప్పుకోదగ్గ స్థాయిలో వినతులు రాలేదు. కలెక్టర్ ఎం.హరినారాయణన్‌తోపాటు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్‌ఓ లవన్న, జెడ్పీ డిప్యూటీ సీఈఓ చిరంజీవి ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు.

కార్యక్రమంలో జలవనరులశాఖ ఎస్‌ఈ కృష్ణమోహన్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ గంగాధర్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ విజయన్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చందర్, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, వ్యవసాయ, మత్స్య, పశుసంవర్ధక శాఖల జేడీలు సత్యవాణి, నాగేశ్వరరావు, డాక్టర్ కోటేశ్వరరావు, ఐసీడీఎస్, మెప్మా పీడీలు హేనా సుజన్, రవీంద్ర, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

సంగం: మండలంలోని సిద్ధీపురం వద్ద నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు సిద్ధీపురం ఎస్సీకాలనీకి చెందిన అంకమ్మ కుమారుడు ఆళ్ల రామయ్య(43) అవివాహితుడు. ఎస్సీకాలనీకి సమీపంలోని నెల్లూరు–ముంబై జాతీయ రహదారి పక్కనే ఉన్న తన అక్క అరుణమ్మ వద్దకు వెళ్లేందుకు రామయ్య రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో రామయ్య అక్కడిక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై నాగార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని రామయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రామయ్య మృతితో తల్లి అంకమ్మ, అక్క అరుణమ్మ కన్నీరుమున్నీరుగా విలపించారు.

నిమ్మధరలు

పొదలకూరు (కిలో)

పెద్దవి	: రూ.65
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.30



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్: (లైవ్)	రూ.130
లేయర్ (లైవ్)	రూ.120
బ్రాయిలర్ చికెన్:	రూ.234
స్కిన్‌లెస్ చికెన్:	రూ.260
లేయర్ చికెన్:	రూ.204



సమస్యలను పరిష్కరించండి

నెల్లూరు(క్రైమ్): క్షేత్రస్థాయిలో మా సమస్యలను పట్టించుకోవడం లేదు.. మీరైనా స్పందించి పరిష్కరించండి.. అంటూ బాధితులు ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్‌ను కోరారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 76 మంది విచ్చేసి తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఆన్‌లైన్ మోసాలు, అత్తింటి వేధింపులు, కేసులు నమోదులో నిర్లక్ష్యం, ఆస్తి వివాదాలు, పిల్లలు పట్టించుకోవడం లేదని, అనధికార చీటీలు తదితరాలపై వినతులు అందాయి. వాటిని నిశితంగా పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. వినతుల పరిష్కారంలో అలసత్వం వహించరాదని సూచించారు.



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

పోలీసులు పట్టించుకోలేదు



బాధితురాలు రహమ్తున్నిసాతో మాట్లాడుతున్న ఏఎస్పీ సౌజన్య

నేను పుట్టుకతో దివ్యాంగురాలిని. నగదు కోసం నా పెద్ద తమ్ముడు షకీర్ నాపై గత నెల 14వ తేదీన దాడి చేశాడు. నాకు తల పగిలి తీవ్రగాయమైంది. అడ్డొచ్చిన మా అమ్మ, చిన్న తమ్ముడుపై సైతం దాడి చేశారు. తీవ్రగాయాలతో నేను హాస్పిటల్‌లో చేరి మరుసటి రోజు నెల్లూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాను. పోలీసులు ఇంతవరకు పట్టించుకోలేదు. నా పెద్ద తమ్ముడి నుంచి ప్రాణహాని ఉంది. రక్షణ కల్పించండి.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు నగరంలోని భగత్‌సింగ్‌కాలనీ టిడ్కో ఇళ్లలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. ఒంగోలు పట్టణానికి చెందిన షేక్ గౌసియా, బడేరసూల్ దంపతులకు షేక్ రియాజ్, షేక్ రహేనా, షేక్ ఫయాజ్(25) సంతానం. ఫయాజ్‌కు ఆరేళ్ల క్రితం నెల్లూరులోని జనార్దనరెడ్డికాలనీకి చెందిన మల్లికతో వివాహమైంది. వారికి నాలుగేళ్ల నిస్సార్ అహ్మద్ కుమారుడు. వివాహమైన కొత్తల్లోనే ఫయాజ్‌కు యాక్సిడెంట్ కావడంతో ఎడమచేతికి, కాలికి తీవ్రగాయాలయ్యాయి. వైద్యులు శస్త్రచికిత్స చేసి రాడ్లను అమర్చారు. అప్పటి నుంచి ఆయన సరిగా పనిచేయలేకపోతున్నాడు. ఈ క్రమంలో ఆయన ప్రకాశం జిల్లా సింగరాయకొండలో పంక్చర్ షాపు పెట్టుకున్నాడు. నెల్లూరు భగత్‌సింగ్‌కాలనీలోని టిడ్కో ఇళ్లలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. అక్కడ భార్య, కుమారుడిని ఉంచి అప్పుడప్పుడూ నెల్లూరుకు వచ్చి వెళ్లేవాడు. ఈ క్రమంలోనే ఫయాజ్ వ్యసనాలకు బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి, దంపతుల నడుమ మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. పలుమార్లు ఇరు కుటుంబాల వారు ఆ దంపతులకు సర్దిచెప్పారు. ఈ క్రమంలో గత నెల 30వ తేదీ రాత్రి ఫయాజ్ పూటుగా మద్యం తాగాడు. పుట్టింట్లో ఉన్న భార్య మల్లిక వద్దకు వెళ్లి ఆమెను తీసుకుని తన ఇంటికి వెళ్లాడు. దంపతులు అర్ధరాత్రి వరకు మాట్లాడుకున్నారు. అనంతరం ఫయాజ్ తన గదిలోకి వెళ్లి స్కార్ఫ్‌తో సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లోనికి వెళ్లిన భర్త ఎంతకీ బయటకు రాకపోవడంతో ఆమె తలుపులు తెరిచే ప్రయత్నం చేయగా అవి తెరుచుకోలేదు. దీంతో ఆమె పక్కింట్లో ఉంటున్న వారి సాయంతో తలుపులు పగులగొట్టి చూడగా ఫయాజ్ ఉరేసుకుని ఉండడంతో కిందకు దించి నగరంలోని ఓ హాస్పిటల్‌కు తరలించారు, అయితే అతను అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. దీంతో జరిగిన విషయాన్ని మృతుడి అక్క రోహనకు మల్లిక తెలియజేసింది. ఆమె నెల్లూరుకు చేరుకుని ఈ మేరకు నవాబుపేట పోలీసులకు సోమవారం తెలియజేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి

- కలెక్టర్‌కు వలంటీర్ల వినతి

నెల్లూరు(దర్గామిట్ట): గత ఐదేళ్లుగా తామంతా వలంటీర్లుగా విధులు నిర్వహించామని, కరోనా కష్టకాలంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పనిచేశామని, ప్రస్తుతం తమకు ఎలాంటి విధులు అప్పగించలేదని, వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని కోరుతూ నెల్లూరు అర్బన్ 42వ వార్డు వలంటీర్లు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీన ఉదయం 6 గంటలకే పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు అందజేసేవాళ్లమని తెలిపారు. అలాగే అర్హులైన లబ్ధిదారులకు అందాల్సిన సంక్షేమ పథకాల గురించి వారికి అందేలా చర్యలు తీసుకునే వారమని తెలిపారు. సచివాలయాల పరిధిలో జరిగే సర్వేల్లో పాల్గొని 100 శాతం పూర్తి చేశామని గుర్తుచేశారు. తమ విధులు తాము నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వలంటీర్లు హఫీజ్, షేక్ సద్దాం, షేక్ మాహిర్, షేక్ సిరాజ్, బి.సంధ్యారాణి, పి.అబ్దుల్, షేక్ జాకీరా, షేక్ కరిష్మా, షేక్ షాకీరా తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్ వద్ద వివరాలు తెలుపుతున్న వలంటీర్లు

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన నెల్లూరు సౌత్ రైల్వేస్టేషన్‌లో నెల్లూరు వైపు వచ్చే రైలు పట్టాలపై సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. అతని వయస్సు సుమారు 45 నుంచి 50 ఏళ్ల లోపు ఉంటుంది. అతను స్కై బ్లూ కలర్ ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, నలుపురంగు షార్ట్, తెలుపు, బులుగు చెక్స్ టవల్ ధరించి ఉన్నాడు. ప్రమాదంపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై జి.మాల కొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.